స్కెచ్

# ఎవరి ప్రపంచం వారిది!

ఓగేటి శివరామకృష్ణ

ఏటిపాయి గ్రామంలో వర్తక శ్రేష్ఠులైన నారాయణయ్యగారికి సుస్తీ చేసింది. కాస్తో కూస్తో వర్తకుల్లో పేరుసంపాదించుకొని బ్రతుకుతున్న వాడు నారాయణయ్య. మరి సుస్తీ చేసిందంటే ఊరుపక్కలనుంచి చూడ్డానికి జనం వస్తున్నప్పుడు ఊళ్ళోవాళ్ళు తీర్థ ప్రజ క్రింద వచ్చి నారాయణయ్యమీద తమతమ భక్తివిశ్వాసాలు చూపుకోటం సమంజసం. ఎంతో మంది వచ్చారు, ఎంతో సేపు మాట్లాడారు.

ఒకాయన అన్నారు: 'నారాయణయ్యా, మిమ్మల్ని పదిరోజులనుంచి చూడక పోవటంవల్ల యేమిటో మనస్సు బాగుండలేదు. ప్రతిరోజూ మిమ్మల్ని చూసి రావాలని ఉద్దేశం ఉంటూనే ఉండేది. అయితే యెంత వీలు చేసుకొని వద్దామని ప్రయత్నించినా వీలుండేగాదు. ఎలాగో, ఎక్కడపని అక్కడ వదలి శ్రమపడి ఈ దినానికి మిమ్మల్ని వచ్చి చూసుకో గలిగాను. కాస్త సంతృప్తి యీ వేళకు కలిగింది. నిజంగా నారాయణయ్యా! ఏమిటో మీ పలుకు పదిరోజులనుంచి వినబడటం లేదంటే, మనస్సు మనస్సులో ఉంటూండేది కాదంటే నమ్మండి' —అని.

మరో ఆయన ప్రయాసపడుతూ అన్నాడు: ఎప్పుడో సరిగా రైలెక్కుతూంటే నిన్ను పల్కరించాను నారాయణయ్యా. అప్పటినుండి, మనం యిద్దరం కలుసుకోనే లేదు. ఎప్పటికప్పుడు వద్దామని ప్రయత్నం చేస్తూనే ఉన్నా, అయితే వెధవ సంసారం, వెధవ వ్యవహారాలు తేలి యేడుస్తేగా. మొన్న మా పెద్దాడు చవగ్గా వస్తూంటే ధాన్యం కొని నిలవేశాడు. దాని దుంపతెగ మర్నాడు బస్తాకు రెండున్నర లాభం మీద బేరాలొచ్చాయి. ఏంచేసేది. కొన్న సరుకు రహస్యంగా. అమ్మకంగూడా రహస్యంగా జరిగి పోకపోతే కొంపలుమునిగిపోవూ. ఏం నారాయణయ్యా, ఎల్లాగో ప్రయాసపడి నిన్నరాత్రి నిలవ వుంచిన సరుకంతా బయటకు పంపించటం జరిగింది. వెధవది యెక్కడ చూస్తారో అనిభయం. లోకువగా దొరికాం వాళ్లు మనల్ని పట్టుకుని పీడిస్తారు నారాయణయ్యా...' అని.

ఒక ముసలాయన అన్నాడు: 'నా తండ్రీ నారాయణయ్యా. నీకీ ముక్కుమాలిన రోగం యెలా ప్రవేసించిందిరా. ఏనుగు మల్లె ఉండేవాడివి. ఏ పని కైనా స్వయంగా చేసుకొనేవాడివి. నాలాంటి చిన్న వర్తకులందరికీ తగిన సలహా లిచ్చేవాడివి. నీ వ్యాపారంతో బాటు మా వ్యాపారం వృద్ధి చేసిపెట్టిన వాడివి. ఏం పాపం చేసుకొన్నావురా! నీ మొండి ధైర్యం, చొరవా, మా దగ్గ యెవళ్ళవద్దా లేవురా! నీ మాటప్రకారం, నీతో నే వర్తకం చేశాం. ఏదో యింత సంపాదించి పెట్టావు. మొన్న కొన్న సరుకు నీ మాటమీదనే. నువ్వుంటే మంచం యెక్కావ్. యోచన చెప్పి నీవే చేయాలి. ఆ సరుకు విషయం యేం తేల్చావురా! ఇప్పటికిప్పుడు అమ్మితే ఒక రూపాయైనా బస్తాకు లాభం వస్తుందట. మరి రెండు రోజుల్లో ధర తగ్గుతుందంటున్నారు ఏంచేయమంటావురా నీ ఉద్దేశం! నారాయణయ్యా నను మోసానికి ఈ దేవుడు నీకో రోగం యెందుకు దాపురింప చేశాడ్రా!' —అని.

ముప్పై అయిదు సంవత్సరాల వయస్సు సుమారుగా ఉన్న ఒకాయన యీ విధంగా చెప్పటం మొదలుపెట్టాడు: 'నారాయణయ్య బాబూ! నీ తెలివితేటలూ వ్యాపారానుభవం మరెవరికి వస్తాయి బాబూ. నీ మాటమీద, నీ మాట ప్రకారం నడుచుమని, నన్ను బతిమిలాడి తీసుకొచ్చావ్. ముందు ముందుగూడా నీ మాటల ప్రకారమే నడుచుకొందా మనుకొంటున్నా.' అందుకనే డబ్బు సిద్ధంచేసుకొంటున్నా. అంతల్లో సంగతి తెల్సింది, తండ్రి తర్వాత.

తండ్రివి. నాకు వెనక యెవరున్నారు నారాయణబాబూ! రెక్కలు కట్టుకువాలాను, నిజంగా నారాయణబాబూ. ఈ విషయం తెలిసీ తెలియటంతోటే నాకెంత విచారం కల్గిందో! అబ్బ. సమయానికి మా బంధువులింట్లో పెండ్లి. ఏమిటో మనస్సు, నీమీద ఉంటే ఎలా వెళ్లగలను బాబాయ్. వెంటనే యిలా బయలుదేరి వచ్చేశా. అయితే బాగాన్, మనం ఆ వేళ మాట్లాడిన సంగతి గురించి మరి యోచించావా? చాలా చిక్కగా ఉంది బాబాయ్. అవున్లే, నీ ఆరోగ్యం కంటేనా? ఏమిటో బాబాయ్ నువ్వంటే మరి చెప్పలేను బాబాయ్ మరింత దగ్గర విషయం తెలిసి, తర్వాత ఒక్క నిముషం ఉండలేక పోయాను బాబాయ్' అని.

మరో నవ వయస్కుడు అన్నాడు: 'తాతాయ్! నీలాంటి వ్యక్తి మరి మనం యెంత ప్రయత్నించినా దొరకడు నీ ధైర్య సాహసాలు మరి యెవరికీ అబ్బవు. వ్యాధి తగ్గుతుంది కాని తాతాయ్. కొద్దిగా మాట్లాడటం మానాలి. పూర్తియైన విశ్రాంతి తీసుకొంటేగాని ఆరోగ్యం బలం పొందదు. గుర్తుందా నాకు జబ్బుచేసి నప్పుడు, పిచ్చి కోపంలోనే యేమేమో మాటలు అంటూంటే నవ్వుతూ నన్నుగురించి అన్నమాటలు 'ఓర్పు' - శాంతం, పరిపూర్ణ, విశ్రాంతి, జ్ఞాపకం ఉన్నాయా? ఎంతమంది చూడ్డానికి వచ్చినా మాట్లాడటం మానెయ్యాలి తాతాయ్. ముందు పరిపూర్ణ విశ్రాంతి, తీసుకొన్నతర్వాత, మిగిలిన విషయాలు యోచించవచ్చు తాతాయ్! ఏమంటావ్ తాతాయ్! అని.

ఒక ముప్పై సంవత్సరాల వయస్సులో ఉన్న స్త్రీ అనటం మొదలుపెట్టింది: 'ఎప్పటికప్పుడు వచ్చి నిన్ను చూదామనుకొంటున్నా. అయితే వీలుంటేనా!- ఏదో గొడవతో సరిపోతూంది. సరిగ్గా యీ వేళ ప్రొద్దుట చంటాడికి పాలు కలిపి పట్టిస్తూంటే, ఆయనొచ్చి ఓసారి చూసొద్దాం బయలదేర మన్నారు. వెంటనే బయలుదేరాను. రూపాయన్నర అద్దె. అద్దెలు మహాజోరుగా పెరిగిపోయాయన్నయ్యా! ఆయన బయలుదేరిరావటం ఓ పెళ్ళిప్రయాణం అంటే నమ్మ. ఎన్నెన్నో సర్దుకురావాలి. ఏదో ఒక పని అస్తమానూ ఉంటూనే ఉంటుంది; నిముషం అయినా నిజంగా ఊపిరి విడవటానికి తీరుబడి ఉండటంలేదు. ఏదో యీ వేళ మేం నిజంగా అదృష్టవంతులం; నిన్ను కళ్ళారా చూసుకొన్నాం. నిజంగా ఆయన పనిలో నిమగ్నులయ్యారంటే, మళ్ళా తిరిగి రావటంగాని, నిన్ను చూడ్డంగాని జరుగుతుందా?' అని.

మరో నలభై వస్సరాల వయస్సు గల స్త్రీ, ఒకామె యీవిధంగా చెప్పటం మొదలుపెట్టింది: 'నారాయణన్నయ్యా! నీకు జబ్బు చేసినప్పటి నుంచీ, నా కళ్ళకు కునుకు ఉండటం లేదంటే నమ్ము. చెప్పలేని బాధ మనస్సులో పీకుతూందేది. అక్కడ మరిచి యిక్కడకు రావటమంటే మాటలా తోడుగా పెద్దకోడలు బిడ్డను ఎత్తుకు వచ్చింది, చిన్నకోడలుకు నెలలు నిండాయి. రేపో మాపో అంటూఉంది. ఆ గొడవలు యెప్పుడూ ఉండేవే అని యెలాగో వీలు చేసుకొని, నీమీదుండే ప్రేమచేత ప్రొద్దుటే బయలుదేరి వచ్చేశా. నారాయణయ్య అన్నా... నీలాంటివాడు మాకు పదికాలాలపాటు బ్రతకడం కంటె మరేంకావాలి? నువ్వు నాలుగు డబ్బులు సంపాదించితే మీనుంచి, ఏదో తీసుకొనేవాళ్ళు మావాళ్ళు. ఏమంటావయ్యా? ముందు నువ్వు నీ ఆరోగ్య విషయం జాగ్రత్తగా గమనించాలి. ఆలస్యం చేస్తే లాభంలేదు. తగిన మందులు తీసుకొంటూయుండు. డబ్బుకేం పోతే వస్తుంది. విశ్రాంతి హెచ్చుగా తీసుకొంటూ ఉండాలి. లేకపోతే ఆరోగ్యం చెడిపోతుంది. ఈలా అందరితోనూ మాట్లాడటం మానెయ్యాలయ్యా! నెమ్మదయిన తర్వాత యెంతో మాట్లాడవచ్చు'- అని.

ఈ విధంగా వచ్చిన వాళ్ళు ఒకరి తర్వాత ఒకరుగా, తమతమ ప్రయాణ విశేషాల గురించి, వర్తకంలోని లాభనష్టాల గురించి. నారాయణయ్య ఆస్తినిగురించి తోచిన విధంగా మాట్లాడుతూ 'నిశ్శబ్దం' అనే మాటను దరినైనా చేరనివ్వలేదు. నారాయణయ్య ఒక స్థితిలో కళ్ళు మూస్తే, తేలవేస్తూంటేకూడా వాళ్ళ సంభాషణలు అలాగే కరిగిపోతున్నాయ్. కాని ఒకగంట యిలా గడిచిందో లేదో! 'అబ్బ...దూరంగా రా'-అంటూంది ముప్పైఅయిదు సంవత్సరాల స్త్రీ!